క్లుప్తంగా

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : జిల్లా న్యాసేవాధికార సంస్థ అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజు ఉత్తర్వుల మేరకు ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం అందించేందుకు పారా లీగల్ వలంటీర్లు(న్యాయ సహాయకులు)ను నియమిస్తున్నామని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.షియాజ్ ఖాన్ తెలిపారు. ఔత్సాహకులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఎంపికైన వారు స్వచ్ఛందంగా సేవలు అందించాలన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయొద్దు

నాతవరం: ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రాకుండా ఉంటాయని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలో శుక్రవారం మర్రిపాలెం పంచాయతీలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగాఅవగాహన ర్యాలీ నిర్వహించారు, వీధుల్లో చెత్తను తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద తడిచెత్త, పొడి చెత్తను ఆరుబయట వేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రా లు నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి చిన్న పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనితీరు బాగుండాలి

నాతవరం: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు విషయంలో తరుచు పర్యవేక్షణ ఉండాలని మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి అన్నా రు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పను లు చేసేటప్పుడు విధిగా నియమ నిబంధనలు పాటించాలని లేకుంటే క్షేత్ర స్థాయి ఉన్నతాధికారుల పరిశీలనలో ఇబ్బందులు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో ముందస్తుగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు సారథ్యంలో పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, భగవద్గీత శ్లోకాలు వల్లె వేయించడం, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసశర్మ, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు హసీనా, చేతుల మీదుగా అందజేశారు. మహిళా పోలీసు లగుడు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బుచ్చెయ్యపేట: అందరి ఆరోగ్యాలు బాగుండాలంటే తప్పని సరిగా అందరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో లవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన చిన అప్పనపాలెం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా గ్రామంలో పేరుకు పోయిన చెత్తాచెదారం పంచాయతీ సిబ్బందితో తొలగించారు. మురుగు కాలవలను శుభ్రం చేయించి తుప్పలు,డొంకలను నరికించి గ్రామానికి దూరంగా తరలించారు.

సింగన్నదొరపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

కె.కోటపాడు : సింగన్నదొరపాలెం గ్రామంలో సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో శంకర్ ఫౌండేషన్‌కు చెందిన అఫ్తాలమిక్‌లు మహేందర్ రెడ్డి, నజీర్ భాషా, సాయికుమార్ 89 మందికి కంటి పరీక్షలు జరిపారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమయిన వారికి ఉచితంగా శంకర్ ఫౌండేషన్‌లో కంటి ఆపరేషన్‌లు జరపనున్నట్టు క్యాంప్ ఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘమిత్ర సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి పాల్గొన్నారు.

ఎంఎల్‌సీసీ కమిటీలో రెండు రెవెన్యూ సమస్యల విచారణ


విచారణ చేపడుతున్న దృశ్యం

మాడుగుల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎంఎల్ సీసీ కమిటీలో రెండు రెవెన్యూ సమస్యలకు సంబంధించి విచారణ చేపట్టడం జరిగిందని తహసీల్దార్ కె. రమాదేవి అన్నారు. రెవెన్యూకు సంబంధించి తమ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ ఎం.రాజా, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు పుస్తకాలు వితరణ

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలకు నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు పోటీపరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలు ఉచితంగా శుక్రవారం అందజేసి మాట్లాడారు. ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన విలువైన పుస్తకాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి పాల్గొన్నారు.

ఈ మలుపులు... ప్రమాదానికి పిలుపులు

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపక్క తుప్పలు బలిసి మలుపుల్లో రోడ్డు కనబడకుండా ఉన్నాయి. రోడ్డు అంచులు కూడా కోతకు గురై రోడ్డు దెబ్బతిని వాలుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో వాహన **చోదకులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.**


ఎన్.కొత్తూరు మార్గంలో మలుపు



రోలుగుంట : మండలంలో జె.**పీ అగ్రహారం నుంచి** కుసుర్లపూడి మీదుగా కొమ**రవోలు వెళ్లే రోడ్డు** పొడవునా ప్రమాదకర మలు**పులు ఉన్నాయి.** అలాగే నిండుగొండ నుంచి ఎస్.**కొత్తూరు మీదుగా** మునిపల్లి, గొల్లపేట,బుచ్చింపే**ట కూడలి వరకూ** అధికంగా మలుపులతో పాటు **రోడ్డు బాగా దెబ్బ**తింది. అలాగే కొవ్వూరు నూకా**లతల్లి గుడి నుంచి** పాపంపేట, శరభవరం, వడ్డిప తదితర గ్రామాలకు వెళ్లే మలుపుల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్దకు వచ్చేసరికి వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్లు శిథిలం కావడంతో పగటిపూట సైతం కొన్ని వాహనాలు అదుపుతప్పి బోల్తాపడి పలువురు గాయాలబారిన పడుతున్నారు. భారీ వాహనాలు మలుపులు తిరగలేక అదుపు తప్పుతున్నాయి. **కొన్ని రూట్లలో రక్షణ గోడలు లేవు. ఈ సమస్యను వాహన చోదకులు, ప్రయాణికులు వలుదఫాలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు. సుమారు మూడేళ్ల క్రితం రాజన్నపేట–వడ్డిప మీదుగా శరభవరం రూట్లో మరిడిమాంబ గుడి సమీపంలో బొబ్బిలి వారి కళ్లాల వద్ద పెళ్లి వ్యాన్ బోల్తా పడిన** ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడి కక్కడే మృతి చెందిన విషయం విదితమే. అలాగే ఇక్కడ సమీప జీడిపిక్కల కర్మాగారంలో పని చేస్తున్న మహిళా కార్మికులు ప్రయాణం చేసే ఆటోలు కూడా తరచూ బోల్తా పడి పలువురూ గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకర మలుపుల్లో రక్షణ గోడలు లేని చోట నిర్మాణలు చేపట్టాలని, అలాగే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల వద్ద ప్రస్తావించగా రోడ్లు పరిశీలించి అవసరాన్ని గుర్తించి అవసరమైన చోట రక్షణ గోడలు మదుములు నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసి తమశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని, అలాగే హెచ్చరిక బోర్డులు ఎక్కడ అవసరమో స్థానికులు వాహనచోదకులతో కలసి వారి సూచనలతో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డులు లేవు



రోలుగుంట నుంచి శరభవరం మీదుగా బుచ్చింపేట, అక్కడనుంచి నర్సీపట్నం –చింతపల్లి రోడ్డును కలిపే నెలిమెట్ట వరకు దారి పొడవునా ప్రమాదకర మలుపులున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు ఈ మలుపులో అదుపు తప్పి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీ కొట్టుకొనే ఘటనలు ఎక్కువగా జరిగాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నియంత్రించే అవకాశం ఉంది.

– సబ్బవరపు జోగినాయుడు, పాపంపేట గ్రామం

తుప్పలు తొలగించాలి



రోలుగుంట నుంచి జానకీరాంపురం, కుసుర్లపూడి మీదుగా నర్సీపట్నం అనకాపల్లి రోడ్డును కలిపే సుబ్బారాయుడుపాలెం కూడలి వరకూ మలుపులు అనేకం ఉన్నాయి. ఈ రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు డొంకలు బలిసి ప్రమాదకర మలుపులో రోడ్డు కనిపించని పరిస్థితి ఉంది. ఈ రూట్‌లో ద్విచక్రవాహనాలు, జానకీరాంపురం సమీపంలో గల జీడిపిక్కల ఫ్యాక్టరీకీ ఆటోల్లో మహిళా కార్మికుల ప్రయాణాలు రేయింబవళ్లు జరుగుతాయి. తుప్పలు బలిసి ఉండడం..ఎదురుగా వచ్చే వాహనాలు మలుపుల్లో కనిపించక పలు ప్రమాదాలు జరిగాయి. తుప్పలు నరికించి మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– లోకారపు ప్రసాద్, కుసుర్లపూడి

ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగనన్న పర్యటన విజయవంతం

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన ప్రజలు, పార్టీశ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న చేపట్టిన మెడికల్ కాలేజీ సందర్శనకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందన్నారు. వేలాది మంది పోలీసులతో బారికేడ్లు పెట్టి ప్రజలు, పార్టీ శ్రేణులు రాకుండా అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఏమాత్రం తగ్గలేదన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలి వచ్చారన్నారు. ఎన్ని అంక్షలు పెట్టినా జగనన్నపై ఉన్న అభిమానంతో వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. జగన్ పర్యటన విజయవంతానికి కృషి చేసిన నాయకులు, పోలీసుశాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జగన్ పర్యటన సక్సెస్ చేసిన శ్రేణులకు కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ మహిళా నేత ఈర్లె అనురాధ



దేవరాపల్లి : నర్సీపట్నంలో గురువారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను సూపర్ సక్సెస్ చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్–1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ కృతజ్ఞతలు తెలిపారు. దేవరాపల్లి మండలం తారువలో శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు పిలుపుతో జిల్లా, మాడుగుల నియోజకవర్గం వ్యాప్తంగా భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి మాజీ సీఎం జగన్‌కు మద్దతు ప్రకటించడం ఆనందదాయకమన్నారు. అడుగడుగునా పోలీసులు సృష్టించిన ఆటంకాలను దాటుకుంటూ, జోరు వానను సైతం లెక్క చేయకుండా జగన్ వెంట నడిచిన ప్రతి ఒక్కరికీ అనురాధ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గోతిని పూడ్చి ప్రమాదాలు అరికట్టండి

నర్సీపట్నం: బలిఘట్టం వైజంక్షన్ నుండి జోగునాథునిపాలెం వెళ్లే రోడ్డుకు ఏర్పడిన గొయ్యిని పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని జనసేన సీనియర్ నాయకులు అప్పన్నదొరబాబు అర్అండ్‌బీ అధికారులను కోరారు. దొరబాబు, అద్దేపల్లి గణేష్, పార్టీ నాయకులతో కలిసి గుంతను పరిశీలించారు. విషయాన్ని అర్అండ్‌బి ఏఈ నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక మరమ్మతులైన చేపట్టాలని ఏఈని కోరారు. రోడ్డు నిర్మాణానికి, డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.44 లక్షలు మంజూరు చేసిందని, టెండర్లు పిలిచామని త్వరలోనే పనులు చేపడతామని ఏఈ తెలిపారు.


రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యిని ఆర్అండ్‌బీ ఏఈకి చూపిస్తున్న జనసేన నాయకులు

గోతుల్లో కూరుకుపోయిన వాహనాలు


రహదారి మధ్యలో కూరుకుపోయిన వ్యాన్లు


గోతులను పూడ్చుతున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: మండలంలో వడ్డాది – పాడేరు రహదారిలో ఎం. కోడూరు మోదమాంబ ఆలయ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు రెండు వ్యాన్లు గోతుల్లో కూరుకుపోయాయి. ఇవి రహదారికి అడ్డంగా ఉండిపోవడంతో మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాంతో ఎం. కోడూరు నుంచి సాగరం వరకు ఇరువైపులా బస్సులు, ఇతర వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. వెంటనే స్థానికులు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు దృష్టికి సమస్య తీసుకెళ్లగా, ఆయన స్పందించి తన సొంత నగదు వెచ్చించి గోతుల్లో రాయి పిక్క వేసి పూడ్చివేయించారు. తర్వాత దిగుబడిన వాహనాలను జేసీబీ సహాయంతో బయటకు తీసి ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు. స్థానికులు కొండలరావు, పోతిన జగదీష్, కలిమి గోపాల్, జల్లి హరిప్రసాద్, శానాపతి గణేష్, పంచాయతీ స్వీపర్లు సహకారం అందించారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

రోలుగుంట: రాష్ట్రవ్యాపితంగా ఈ నెల 18 వ తేదీ నుంచి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరరాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.త్రిమూర్తులరెడ్డి శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. శేషగిరిరావు, ఉపాధ్యాయ సిబ్బందితో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంబరాల్లో రాష్ట్రస్థాయిలో 4 లక్షల 50 వేల మంది విద్యార్థులు పాల్గొనున్నట్టు తెలిపారు. 18న పాఠశాల స్థాయిలోను, నవంబర్ 1న మండలస్థాయిలోను, అదే నెల 23న జిల్లా స్థాయిలోను, డిసెంబర్ 12 ,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరుగుతాయని, విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని విలేకరులకు తెలిపారు.


చెకుముకి సంబరాల పోస్టరు అవిష్కరిస్తున్న త్రిమూర్తులరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది

పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు మంజూరు

కె.కోటపాడు : రైతులు పశువుల షెడ్ నిర్మాణాలకు ముందుకు వస్తే వారికి ఉపాధి నిధులను కేటాయించనున్నట్లు డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. చౌడువాడలో శుక్రవారం జరిగిన పశువుల షెడ్ నిర్మాణ భూమి పూజా కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 54 పశువుల షెడ్‌ల నిర్మాణాలకు అనుమతులను ఇవ్వగా ఈ నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రెండో విడతలో మండలానికి 72 పశువుల షెడ్‌లను మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు.

స్వచ్ఛందంగా గోతుల పూడ్చివేత

దేవరాపల్లి: కాశీపురం నుంచి వయా చిననందిపల్లి మీదుగా గవరవరం వెళ్లే రహదారిలో భారీ గొయ్యిలు ఏర్పడటంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిననందిపల్లి శివాలయం ఆర్చి సమీపంలో భారీ గొయ్యిలు పడడంతో ఏ.కొత్తపల్లి మీదుగా గాజువాక వెళ్లే ఆర్టీసీ బస్సులు రాకపోకలను నిలిపి వేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో గ్రామస్తులంతా ఏకమై జేసీబీ సహాయంతో మట్టితో గోతులు పూడ్చారు. కాశీపురం నుంచి బోయిలకింతాడ వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులను సైతం యుద్ధప్రాతిపదికన ప్రారంభింప చేశారు.సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు.


చిననందిపల్లిలో గొయ్యిని పూడ్చుతున్న గ్రామస్తులు

బాలికల హక్కులపై అవగాహన


కాశీపురం హైస్కూల్లో బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దేవరాపల్లి: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో పలు పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వేచలం, కాశీపురం, పెదనందిపల్లి హైస్కూల్‌తో పాటు ములకలాపల్లి ఎంపీపీ స్కూల్, బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు వ్యాసరచన, ఆటలు పోటీలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి మండల స్థాయిలో బహుమతులు అందజేస్తామని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎస్. రాములమ్మ, కళ్యాణి తెలిపారు. అనంతరం బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధనేతర పనులు వద్దు


ఎంఈవో లింగమూర్తికి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని మండల యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘం నాయకులు ఎంఈవో లింగమూర్తికి శుక్రవారం వినతిప్రతం అందజేశారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, నాగేశ్వరరావు, హరిప్రసాద్, సుధీర్ మాట్లాడుతూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేపడతామని తెలిపారు.

కె.కోటపాడు : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో వారి బోధనా సమయం హరించుకుపోతున్నట్లు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.శేఖర్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణకు వీరు వినతిపత్రం అందించారు.

అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఆపైన చదివి, 18 నుంచి 44 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. అలాగే కుట్టు శిక్షణలో కూడా శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు. ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9014765287 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాడి రైతులకు బేసిన్లు పంపిణీ

మాడుగుల రూరల్: పాడి రైతులు సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి చేస్తుందని, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ పేర్కొన్నారు. కె.జె.పురం 1 వ పాలసొసైటీ వద్ద పాడి రైతులకు సిల్వర్ దాణా బేసిన్లు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ ఆర్థిక సహకారంతో కళ్లాలకు రోడ్లు, పశువుల షెడ్లు నిర్మిస్తుందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుఖీభవ కార్డు వున్న 354 మందికి ఈ బేసిన్లు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాలసొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు, వేతన కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సూపర్ వైజర్ ఆదిప్పారావు సభ్యులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు..వీధిన పడిన వ్యాపారులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి వినాయక ఆలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలోని దుకాణాలను మున్సిపల్ అధికారులు యంత్రాలతో శుక్రవారం తొలగించారు. దుకాణాల్లోని సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది బయటపడేసారు. గడువు ఇవ్వాలని చిరువ్యాపారులు మున్సిపల్ అధికారులను బతిమిలాడినా వదలేదు. రేకుల షెడ్లను పొక్లెయిన్‌తో తొలగించారు. మాంసం, ఫ్యాన్సీ దుకాణాలు నడుపుతున్న వ్యాపారులు వీధిన పడ్డారు. నలభై ఏళ్లుగా దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని వారు వాపోయారు. మూడు తరాల నుంచి ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ఏనాడూ మమ్మల్ని ఎవరూ ఇబ్బంది పెట్టలేదన్నారు. మున్సిపాలిటీకి ప్రతి ఏటా లైసెన్స్ ఫీజు చెల్లించడమే కాకుండా రోజువారి ఆశీలు కడుతున్నామన్నారు. ఊరులో జరిగే ప్రతి పండగకు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు చందా రూపంలో ఇస్తున్నామన్నారు. మాకు రాజకీయాలతో సంబంధం లేదని, అయినప్పటికీ నాయకులు తమపై కక్ష కట్టి దుకాణాలను తొలగించారని బాధితులు ఆరోపించారు. కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారన్నారు. దుకాణాల తొలగింపుతో తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.


మున్సిపల్ అధికారులు తొలగించిన దుకాణాలు

మహాసభలను విజయవంతం చేయండి

నర్సీపట్నం : ఈ నెల 13,14,15 తేదీల్లో అనంతపురంలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా నాయకులు ఎల్.గౌరీ పిలుపునిచ్చారు. కొత్తవీధి ఐద్వా యూనిట్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని గొప్పగా అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రాత్రి సమయాల్లో మహిళలు పనిచేయాలని చట్టం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మద్యం, మత్తు పదార్థాలపై మాట్లాడిన ప్రభుత్వం వీధి వీధినా బెల్టుషాపులు పెట్టి తాగిస్తున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.వి. సూర్యప్రభ, మహిళలు పాల్గొన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న ఐద్వా నాయకులు గౌరీ, సూర్యప్రభ

వేతనాలు పెంచమంటే పనిదినాలు పెంచారు

గొలుగొండ: కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల్లో పనిచేసుతన్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ప్రైవేట్ సిబ్బంది, స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోకుండా పనిదినాలు పెంచడం వల్ల వీరంతా చాలా ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వర్రావు విమర్శించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గొలుగొండ కార్మిక సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. గతంలో 8 గంటల పనిగంటలు ప్రస్తుతం 13 గంటల పనిచేసే పరిస్థితి వస్తుందని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, అంగన్‌వాడీ సంఘం ప్రోజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మంగ, భ్రమరాంబ, మధ్యాహ్న భోజన పథకం సంఘం అధ్యక్షులు చిన్నతల్లితో పాటు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


గొలుగొండలో నిర్వహిస్తున్న సీఐటీయూ సమావేశం

వ్యవసాయ సిబ్బంది సూచించిన మందులే వినియోగించాలి

దేవరాపల్లి : ఖరీఫ్ వరి పంటలో తెగుళ్ల నివాణకు వ్యవసాయ సిబ్బంది సూచించిన మందులు మాత్రమే ఇవ్వాలని పురుగు మందుల షాపు యజమానులకు మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ సూచించారు. దేవరాపల్లిలోని మన గ్రోమోర్‌షాపులో పురుగు మందుల స్టాక్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో ఆకు ఎండు, పాము పొడ, ఆకు ముడత తెగుళ్లతో పాటు జింక్, సల్ఫర్ లోపం, కాండం తొలుచు పురుగు సోకినట్టు గుర్తించామన్నారు. షాపు యజమానులు సదరు పంట సోకిన తెగుళ్లను పక్కా గుర్తించి మందులు ఇవ్వాలని సూచించారు.

కల్యాణ మండపం ప్రారంభం

రావికమతం : రావికమతంలో విశాఖ డైయిరీ నిధులతో నిర్మించిన తులసి కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే రాజు, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌బాబుతో కలిసి ఎంపీ సీఎం రమేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ, మండల తెదేపా అధ్యక్షుడు శంకరరావు, మాజీ అధ్యక్షుడు కొండనాయుడు పాల్గొన్నారు.